


అసెంబ్లీలోనే కాదు సమాజంలోనూ తెలంగాణ పదం శాశ్వత నిషేధం' అని గ్రహించిన కేసీఆర్ పుట్టినగడ్డ విముక్తి కోసం లెక్కలేనన్ని అవమానాలను దిగమింగారు. కాటగలిసిపోయిన తెలంగాణకు తానే చుక్కానిలా మారారు. ఒక్క పార్టీ కూడా మద్దతు ఇవ్వని తెలంగాణకు దేశంలో 36 రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చేస్థాయికి తీసుకొచ్చారు. తెలంగాణకు తాను 'అడ్డమూ కాదు.. నిలువూ' కాదు అన్నవాళ్లతోనే 'జై తెలంగాణ' అనిపించారు. 'మేం తెలంగాణకు వ్యతిరేకం కాదు' అన్న వాళ్లతోనే 'అనుకూలం' అని లేఖ రాయించారు. ఎదుటి వారి రాజకీయ అనివార్యతను తెలంగాణకు అనుకూలంగా మలచి దాన్నే తెలంగాణకు బలంగా మార్చిండు. తెలంగాణ కోసం 'గొంగడి పురుగునైనా ముద్దాడుతా...' అని 2004లో వరంగల్ ప్రెస్‌క్లబ్ సాక్షిగా ప్రకటించి తెలంగాణ రాష్ట్ర సాధనే తన జీవిత లక్ష్యమని తేటతెల్లం చేశారు. కరీంనగర్ వేదికగా సోనియాగాంధీ నోట తెలంగాణ అనిపించారు. 26 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎంపీలను గెలిచి పదేండ్లు అధికారానికి దూరంగా ఉన్న





కాంగ్రెస్ పార్టీ ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో అధికారంలోకి తెచ్చేందుకు కేసీఆర్ బాటలు వేశారు. పొత్తుధర్మాన్ని వీడిన కాంగ్రెస్ పార్టీ 2006లో బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన 10 మంది ఎమ్మెల్యేలను తన పార్టీలో కలుపుకొన్నది. అలా తెలంగాణ నినాదం చచ్చిపోయిందని నిరూపించే ప్రయత్నం చేసినప్పుడు నిటారుగా నిలబడి సడలిపోని పోరుసలిపారు. తెలంగాణ పదాన్నే అసెంబ్లీలో నిషేధించిన టీడీపీతో





## గులాబీ గుబాళింపు

పార్టీకి గులాబీ రంగును ఖరారు చేసే విషయంలో కేసీఆర్ అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల జెండా రంగులు.. ప్రపంచంలోని ఆయా దేశాల జాతీయ పతాకాలు.. వాటి రంగులు మొదలైనవి పరిశీలించారు. మనిషికి 'ప్రేమపూర్వక ఆదరణ', మనసుకు 'స్వచ్ఛమైన ప్రశాంతత', సమాజానికి 'శుభసూచకం'గా గులాబీ రంగును భావించటం ఆనవాయితీ. దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల జెండాల పక్కన గులాబీ రంగు జెండాను పెడితే వాటన్నిటినీ అది డామినేట్ చేస్తుంది. 'తెలంగాణ గడ్డమీద ఎగిరిన ఈ గులాబీ జెండా నా తెలంగాణ ప్రజలను ఆకాశమంత ఎత్తున సగర్వంగా నిలబెట్టాలి. అందుకోసమే నేను అడుగు వేస్తున్న' అని జలదృశ్యంలో పార్టీ జెండాను ఎగురవేస్తూ కేసీఆర్ ఉద్విగ్న భరితంగా పిలుపునిచ్చారు.

